సాక్షి
గుంటూరు
ఆదివారం ၊ 29 ၊ సెప్టెంబర్ ၊ 2024



## జాషువా గృహ సందర్శన

వినుకొండ(నూజెండ్ల): కవి కోకిల గుర్రం జాషువా స్వగ్రామం చాట్రగడ్డపాడులోని ఆయన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నాయకులు శనివారం సందర్శించారు.



## పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 24890 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16000 క్యూసెక్కులు వదులుతున్నారు.

## ఆలయంలో పూజలు



మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# స్వామీ... బాబుకు బుద్ధి చెప్పు

**తిరుమల... కలియుగ దేవుడు కొలువైన అత్యంత పవిత్రమైన ప్రదేశం. ఒక్కసారి అక్కడ అడుగు పెట్టడమే భాగ్యంగా భావిస్తారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన వేంకన్న లడ్డూ ప్రసాదానికి పాలకులు రాజకీయ రంగు పులిమి కళంకితం చేశారు. ఇలాంటి దుష్ట రాజకీయాలు చేస్తున్న వారిని శిక్షించి.. ఆ పాపం ప్రజలకు అంటకుండా రక్షించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో పూజలు చేశాయి. చంద్రబాబు, పవన్, కూటమిలోని నేతలకు సద్బుద్ధిని ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు.**

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నేతలు

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలిపై అంబటి మండిపాటు
- పాపభారం ప్రజలపై పడకుండా చూడాలని వేడుకోలు



గుంటూరులోని సీతారామ ఆలయంలో పూజలు చేసిన అంబటి, విడదల రజిని, మోదుగుల, ఏసురత్నం తదితరులు

పట్నంబజారు/కొరిటెపాడు(గుంటూరు): వైఎస్సార్ సీపీని అపఖ్యాతిపాలు చేయాలనే దుర్బుద్ధితో సీఎం చంద్రబాబు అసత్య ప్రచారాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని, తప్పు చేసిన వారిని ఆ భగవంతుడు కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు కొరిటెపాడు రెడ్ల బజారులోని సీతారామ ఆలయంలో, గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నందివెలుగురోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానాలలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం అబద్ధపు ప్రచారాలకు తెరదీశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అండ్ కో వ్యవహరిస్తున్న తీరుతో స్వామి వారికి కోపం వచ్చి, దానిని ప్రజలపై చూపెట్టకుండా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే ఇలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి దర్శనానికి వెళుతుంటే.. కూటమి నేతలు అడ్డంకులు సృష్టించడం అప్రజాస్వామికం అని పేర్కొన్నారు. దేవుళ్లను కూడా నీచ రాజకీయాలకు వాడుకునే చంద్రబాబుకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ మంత్రులు, నాయకుల్లో మార్పు రావాలని దేవాలయానికి వచ్చి పూజలు చేశామని తెలిపారు. ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌ను అంటరాని వ్యక్తిగా చూస్తూ.. గుడికి రావాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనటం సరి కాదన్నారు. పేదవాడి కడుపునింపిన వైఎస్ జగన్.. కల్తీ ఏ రకంగా చేస్తారని నిలదీశారు. దుష్ప్రచారాలు చేస్తున్నారని, అసలు ఆయనకు ఆ అవసరం ఏముందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ తిరుమల లడ్డూపై అసత్యాలు ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడి పాపాలు రాష్ట్ర ప్రజలపై పడకుండా చూడాలని ఆలయంలో పూజలు చేసినట్లు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ.. తమ పాలన గురించి చెప్పుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కూటమి నేతలు ఇలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నందివెలుగు రోడ్డులోని దేవస్థానాలలో పూజల అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు , వంగల వలివీరారెడ్డి, కార్పొరేటర్లు వంగల హేమలత, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, ఎ.సంతోష్, రోషన్, అడకా పద్మావతి, యక్కలూరి కోటిలింగారెడ్డి, కరుణాకరరెడ్డి, బద్రి, వసంత్, చిలకా సురేష్ , షేక్ మొహమూద్, ఆబీద్‌బాషా, రామనబోయిన అజయ్‌యాదవ్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, పూనూరి నాగేశ్వరరావు, బత్తుల దేవా, పల్లా శ్రీను, వాకా శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కీసరి సుబ్బులు, కీసరి సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, మొగిలి సతీష్, మాధవ, పఠాన్ రిహానా, అంబేడ్కర్, దూపాటి వంశీ, రామిశెట్టి రాంబాబు, జేపీ రెడ్డి, పల్లా కిషోర్, స్వర్ణ, బడాగిరి నాగరాజు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్పిరెడ్డి, నూరి ఫాతిమా పూజలు

### పొన్నూరు



పొన్నూరు నియోజకవర్గంలోని పొన్నూరు పట్టణం శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోని స్వర్ణ వేంకటేశ్వరస్వామి గుడిలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ముఖ్యనేతలు తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో స్థానిక నేతలు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ప్రత్తిపాడు



ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు రూరల్ పరిధి నల్లపాడు గ్రామంలోని సీతారామ టౌన్‌షిప్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, నియోజకవర్గ, మండల నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేసినట్లు వారు పేర్కొన్నారు.

### తెనాలి



తెనాలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు వైకుంఠపురం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాయి. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చేందుకు ఇలా వ్యవహరిస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణీతి, పార్టీ నేతలు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

### మంగళగిరి



మంగళగిరి నియోజవకర్గంలోని తాడేపల్లి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరరావు స్వామి ఆలయంలో, కుంచనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉండవల్లి రామ మందిరం, ఆత్మకూరు రామమందిరంలో, మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో, యర్రబాలెం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు. వైఫల్యాలు బయటకు రాకుండా ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు.

### తాడికొండ



తాడికొండ నియోజకవర్గంలోని లాంలో వేంచేసియున్న గంగా ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, విశ్రాంత ఐటీ అధికారి మేకతోటి దయాసాగర్, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఇలా వ్యవహరిస్తున్నారని నాయకులు మండిపడ్డారు.

## గుంటూరు చానల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని**

గుంటూరు వెస్ట్: గుంటూరు చానల్ ఆధునికీరణతోపాటు ఇతర తాగు, సాగునీటి కాలువల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో గుంటూరు చానల్‌తోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. గుంటూరు చానల్ ఆధునికీకరణకు సుమారు రూ.900 కోట్ల వరకు అవసరమన్నారు. రానున్న బడ్జెట్‌లో పనుల ప్రారంభం కోసం కనీసం రూ.100 కోట్లు అవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. గుంటూరు నల్ల డ్రైన్‌కు, నల్లమడ చానల్ అభివృద్ధికి కూడా రూ.20 కోట్లు నుంచి రూ.30 కోట్ల చొప్పున ఖర్చవుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

**విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అవసరం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారని అధికారులతో పెమ్మసాని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు యువతకు కూడా నైపుణ్యం పెంచేలా వెంటనే తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

## పవన్ కళ్యాణ్ కూడా డిక్లరేషన్ ఇవ్వాల్సిందే..!

**సీపీఐ జిల్లా కార్యదర్శి డిమాండ్**

లక్ష్మీపురం: తిరుమలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని, ఆయన భార్య క్రిస్టియన్ అని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో భవిష్యత్తులో లడ్డూ కల్తీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి కొన్ని రోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏకంగా గెటప్ మార్చేసి దీక్ష చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ ఇవ్వాల్సి వస్తే డిప్యూటీ సీఎం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్‌ను ఆయుధంగా ఉపయోగించి బీజేపీ ఆడుతున్న నాటకం ఇదని విమర్శించారు. జగన్ మోహన్‌రెడ్డిని లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 588.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,350, ఎడమకాలువకు 5,439, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,574, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 41,162 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ఇక్కడ నుంచి అంతే నీటిని విడుదల చేస్తున్నారు.



## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అభినందనీయం

నగరంపాలెం: ఇటీవల జిల్లాలోని కోర్టుల్లో జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శనివారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడుతూ.. కేసుల్లో రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. క్షణికావేశంలో జరిగిన తప్పులకు సంబంధించిన కేసులను సులభగా లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అనంతరం నేరాలు, నియంత్రణ చర్యలపై జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్ కేసుల విచారణ వేగవంతంగా చేపట్టాలని అన్నారు. పలు కేసుల్లో ప్రతిభ చూపిన 53 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు రివార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరామ్ ప్రసాద్ (పశ్చిమ), రమేష్ (ట్రాఫిక్), జనార్దనరావు (తెనాలి), మల్లికార్జునరావు (ఎస్సీ, ఎస్టీ), సీతారామయ్య (ఎస్‌బీ), సీఐలు నాగమల్లేశ్వరరావు (డీసీఆర్బీ), డి.వెంకన్న చౌదరి (సీసీఎస్), జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఎస్పీ సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

### న్యూస్‌రీల్

## భారీ వర్షంతో వాహన చోదకులకు అవస్థలు



తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి ఆర్‌యూబీలో భారీ వర్షం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఆర్‌యూబీలోకి చేరి బయటకు కదిలే పరిస్థితి లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 758 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 51 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 30 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 83 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1446 క్యూసెక్కులు విడుదల చేశారు.

## నేటి నుంచి పవిత్రోత్సవాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాహుకేతు పూజలు సహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 2వ తేదీ అమావాస్యను పురస్కరించుకుని అన్ని పూజా కార్యక్రమాలు యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సంబంధిత వాల్‌పోస్టర్‌లు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చే నెల 3 నుంచి ఏపీ టెట్



గుంటూరు వెస్ట్ : జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకు ఏపి టెట్ నిర్వహిస్తామని డీఆర్వో పెద్ది రోజా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పరీక్షలు జరిగే ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని పేర్కొన్నారు.

## ఉచిత న్యాయ సహాయానికి 15100

నరసరావుపేటటౌన్: ఉచిత న్యాయసేవల కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయ అధికారిక నెంబర్ 15100ను వినియోగించుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ పిలుపునిచ్చారు. శనివారం అదనపు జిల్లా కోర్టు చాంబర్‌లో ఉచిత న్యాయ సహాయంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అధికారిక నెంబర్‌ను అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, కోర్టు ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీస్, పాఠశాలలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. నెంబర్‌ను సద్వినియోగం చేసుకొని ఉచిత సేవలను పొందాలని కోరారు.

## క్లుప్తంగా

### ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు



**గుంటూరు మెడికల్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఐఎంఏ హాలులో సంఘ వార్షిక సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. సంఘం సేవలను ప్రధాన కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్ర వివరించారు. అనంతరం ఎన్నికలలో అధ్యక్షుడిగా యార్లగడ్డ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అమర లింగేశ్వరరావు, కార్యదర్శిగా డాక్టర్ సాయి కృష్ణ, సహాయ కార్యదర్శిగా డాక్టర్ చంద్ర రాధికా రాణి , 25 సభ్యులతో కూడిన ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రకటించారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో సమాజానికి ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### ఏపీ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వేణుగోపాల్



**నగరంపాలెం:** ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఎన్నికయ్యారు. గుంటూరు బ్రాడీపేటలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అధ్యక్షత వహించారు. పూర్వ అధ్యక్షులు రొంపిచర్ల శేషాచార్యులు గతేడాది మరణించారు. అప్పటి నుంచి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా వేణుగోపాల్ కొనసాగారు. ఈ క్రమంలో ఆయన్ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంఘం ఆశయాల సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తానని అన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. అందరి సహకారంతో సంఘం ప్రగతికి తగిన కార్యాచరణతో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బృందావనం రాధాకృష్ణమూర్తి, ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ళ కృష్ణమాచార్యులు, దీవి వెంకటశేషు బాబు, పరాశరం జగన్మోహన్, నంది వెలుగు శేషగిరిరావు, పెద్దింటి ఫణి రాజేంద్రకుమార్, చెగోలం శేషాచార్యులు, పలు జిల్లాల నాయకులు యనమదల ఆంజనేయులు, చిట్యాల మల్లికార్జున శర్మ, వడ్డమాను రమణాచార్య, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## లయ తప్పుతున్న

# లబ్..డబ్..!



- చిన్న వయస్సులోనే హార్ట్ స్ట్రోక్
- ఆధునిక జీవనశైలే ప్రధాన కారణం
- అవగాహనతోపాటు జాగ్రత్తలూ ముఖ్యం
- నేడు వరల్డ్ హార్ట్ డే

**గుంటూరు మెడికల్** సినీ హీరోలు, ప్రముఖ రాజకీయ యువ నాయకులు సైతం హార్ట్ స్ట్రోక్‌తో అకాల మృత్యువుకు గురవుతున్నారు. కళాశాల యువత సైతం ఇదే తరహాలో చనిపోవడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని కార్డియాలజిస్టులు వెల్లడిస్తున్నారు. వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండె జబ్బు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోవటంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలపై అవగాహనకు ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డేను నిర్వహిస్తున్నారు.



కార్డియాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)



క్యాథ్‌ల్యాబ్ మిషన్

స్విట్జర్లాండ్‌లో జెనీవాలోని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ 2000 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ' సాక్షి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**గుండెజబ్బు నెంబర్ వన్ కిల్లర్**

గుండెజబ్బు నెంబర్ వన్ కిల్లర్. గుండెజబ్బులు రావటానికి పొగాకు వినియోగం ముఖ్య కారణం. బీపీ, షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం, కాలుష్యం, ఉద్యోగ, వ్యాపార, ఇతర కారణాలతో వచ్చే మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవటం, మద్యం సేవించటం, సరిపడా నిద్రలేకపోవటం, డైట్ సక్రమంగా తీసుకోకపోవడం ఇతర కారణాలు. జిల్లాలో 30 మంది గుండె జబ్బు వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ 60 నుంచి 90 మంది వరకు వైద్యం కోసం వస్తున్నారు.

**ఏటా పెరుగుతున్న రోగులు**

జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో గుండెజబ్బు రోగులు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూ ఉండటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక జీవనశైలి వల్ల 25 ఏళ్ల వయస్సు వారిలో గుండెజబ్బులు రావటం చాలా బాధాకరమని వైద్యులు పేర్కొన్నారు.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే...**

జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండి, సమీకృత ఆహారం తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు నమలటం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ఆహారంలో పండ్లు తీసుకోవాలి. రోజూ శారీరక వ్యాయామం చేయటం, ఒత్తిడికి దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం గుండె జబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు.

**జీజీహెచ్‌లో వైద్య సేవల వివరాలు..**

| ఏడాది | ఓపీలో హృద్రోగులు |
|---|---|
| 2021 | 15,171 |
| 2022 | 10,984 |
| 2023 | 12,711 |
| 2024 ఆగస్టు వరకు | 18,449 |

| ఏడాది | గుండె ఆపరేషన్ల సంఖ్య |
|---|---|
| 2020 | 732 |
| 2021 | 1,074 |
| 2022 | 1,294 |
| 2023 | 1,379 |
| 2024 ఆగస్టు వరకు | 1,032 |

### ఉచితంగా కార్పొరేట్ వైద్యం



గుంటూరు జీజీహెచ్ క్యాథ్ ల్యాబ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా కార్పొరేట్ కార్డియాలజీ వైద్య సేవలు అందిస్తున్నాం. యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్, ఇతర వైద్య పద్ధతుల ద్వారా గుండె ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం. తగిన ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే జబ్బుల బారిన పడకుండా ఉండొచ్చు.

– డాక్టర్ బొర్రా విజయ్ చైతన్య, జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్ నిర్వాహకులు

### ముందస్తుగా గుర్తించవచ్చు



గుండె పోటు వచ్చే అవకాశం ఉందా.. లేదా.. అనే విషయాన్ని సీటీ క్యాల్షియం స్కోర్ అనే వైద్య పరీక్ష చేసి దీనిని నిర్ధారిస్తున్నారు. టీఎంటీ టెస్ట్ ద్వారా కూడా అంచనా వేస్తున్నారు. సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే ఇలాంటి మరణాలు తగ్గించవచ్చు.

– డాక్టర్ అనురాగ్ పోలవరపు, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

### వైద్యసేవలు పొందాలంటే......

జీజీహెచ్‌లో లభించే గుండె వైద్య సేవలు పొందాలనుకునే వారు అవుట్ పేషెంట్ విభాగంలో సోమవారం – శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 9– మధ్యాహ్నం 2 గంటల వరకు అవకాశం ఉంది. క్యాజువాల్టీలో 24 గంటలు సేవలు అందిస్తున్నారు. ఓపీలో వైద్యులు ఈసీజీ, టుడి ఎకో, ట్రెడ్‌మిల్ టెస్ట్ లాంటి గుండె జబ్బు నిర్ధారణ పరీక్షలు చేసి అవసరం ఉన్నవారిని ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. ఇన్‌పేషెంట్ విభాగంలో (డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్)లో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారు. హార్ట్ స్ట్రోక్ వచ్చినవారిని ఓపీకి తీసుకెళ్లకుండా నేరుగా వార్డులోకి తీసుకురావచ్చు.

## వైకుంఠపురంలో అపచారాలపై సంప్రోక్షణ చేయాలి

**మంత్రి మనోహర్‌కు మాజీ ఎమ్మెల్యే శివకుమార్ హితవు**

**తెనాలి:** భక్తులు చిన్నతిరుపతిగా పిలుచుకునే స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అపచారాలపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి సారించి సంప్రోక్షణ చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నాబత్తుని శివకుమార్ హితవు పలికారు. తిరుమలలోని శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అనుచిత ఆరోపణలకు ప్రాయశ్చిత్తంగా శనివారం వైకుంఠపురం ఆలయంలో పూజలు చేసిన అనంతరం శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈ దేవస్థానంలో జరుగుతున్న అపచారాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్యం తాగి స్వామి సన్నిధికి వచ్చినట్లు ఆరోపించారు. గుర్తించిన ఆలయ ఈవో క్రమశిక్షణ చర్యలకు పూనుకున్నారని గుర్తుచేశారు. సదరు అర్చకుడు తన వద్దకు వచ్చి బతిమాలుకుని మరోసారి ఇలాంటి తప్పు చేయనని ప్రాధేయపడితే, ప్రధాన అర్చకుడు విధులు కాకుండా ఆలయంలో ఇతర విధుల్లో కొనసాగించాలని తాను సూచించినట్లు చెప్పారు. ఆయనే ఈ రోజున ప్రధాన అర్చకుడిగా బాధ్యతల్లో కొనసాగటం అపచారం కాదా? అని శివకుమార్ ప్రశ్నించారు. కేశఖండన విధుల్లో ఉండాల్సిన కురగంటి రఘురామయ్య అనే వ్యక్తి, అతడి కుమారుడు ఏనాడూ విధులు నిర్వర్తించకుండా జీతాలు తీసుకోవటం అపచారం కాదా అని నిలదీశారు. శ్రీవారి ఆలయంలో సేవలను విస్మరించి, సొంతంగా యూట్యూబ్ చానల్ నడుపుతూ దేవస్థానంలో ఉద్యోగులను భయభ్రాంతులను గురిచేస్తూ, అక్కడ నియామకాలు సహా విధుల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. లడ్డూ వివాదంపై ఇక్కడ యాగం చేసిన మంత్రి మనోహర్.. ఈ అపచారాలపై ఏమంటారని శివకుమార్ ప్రశ్నించారు. సదరు వ్యక్తులు ఇక్కడ కేశఖండన విధులు చేసుకున్నా, ఆలయ సేవలు మానేసి ఇంకేదైనా చేసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. శ్రీవారి సేవలను మానేసి రాజకీయాలకు పూనుకోవటం ఏవిధంగా సమ్మతమని ప్రశ్నించారు.



విలేకరులతో మాట్లాడుతున్న శివకుమార్

### షేర్ మార్కెట్ పేరిట రూ. 45.50 లక్షల మోసం

**తెనాలి రూరల్:** షేర్ మార్కెట్‌లో పెట్టుబడులంటూ గృహిణిని కేటుగాళ్లు నిట్టనిలువునా ముంచారు. పట్టణ నందులపేటకు చెందిన వివాహిత నాగలక్ష్మికి ఇటీవల గుర్తు తెలియని నెంబరు నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం, తద్వారా లాభాలు వస్తాయని ఆ మెసేజ్ సారాంశం. లింక్‌ను క్లిక్ చేసి పలు దఫాల్లో రూ. 45.50 లక్షలు జమ చేశారు. ఆమె పెట్టుబడికి రూ. 1.50 కోట్లు లాభం వచ్చిందంటూ మోసగాళ్లు నమ్మించారు. ఆ నగదు ఆమె ఖాతాలో జమ అవ్వాలంటే అందులో 10 శాతం ముందస్తుగా చెల్లించాల్సి ఉందని షరతు పెట్టారు. మోసపోయానని గ్రహించిన ఆమె సైబర్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ విభాగం నుంచి వచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

## మహోన్నతుడు జాషువా

**దళిత కవి డాక్టర్ కత్తి పద్మారావు**

**పొన్నూరు:** ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు, 'మన కాలపు జాషువా' పురస్కార గ్రహీత, కవి డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కత్తి పద్మారావు మాట్లాడుతూ.. నవయుగ కవి చక్రవర్తి జాషువా కులమత భేదాలను నిరసించిన మహోన్నతుడని కొనియాడారు. కార్యక్రమంలో మహాసభ కోశాధికారి వేము మాధవ్, గేరా ప్రసన్న కుమారి, జి. శాంతి, దాసరి శ్యామల, ఎస్. సుబ్బారావు, జొన్నలగడ్డ రాణి పాల్గొన్నారు.

**జాషువా కవిత్వం యువతకు మార్గదర్శకం**

**ఏఎన్‌యూ:** సామాజిక స్పృహ, చైతన్యం పెంచుతూ రుగ్మతలను నిర్మూలించేందుకు మార్గం చూపే జాషువా కవిత్వం యువతకు మార్గదర్శకం అని యూనివర్సిటీ పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుర్రం జాషువా జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాషువా రచనలను విద్యార్థులు తప్పకుండా అధ్యయనం చేయాలన్నారు. వర్సిటీ గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె. సోమశేఖర్ మాట్లాడుతూ.. తనకు ఎదురైన అవమానాలనే ఆయుధాలుగా జాషువా మలచుకున్నారన్నారు. అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జాషువా రచనలలోని సారాన్ని గ్రహించి అడుగులు వేస్తే సులువుగా లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో జాషువా కళాపీఠాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన సాహిత్యంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిగేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, టీఎస్‌టీయూసీ నాయకుడు కోటేశ్వరరావు, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటి, పరిశోధక సంఘ నాయకులు పి.అభిషేక్, వై.రవికిరణ్, టి.రాంబాబు, డాక్టర్ రాజశేఖర్, వై.రాజేష్, ఎస్.శాస్త్రి, సునీల్, ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు ప్రఫుల్, కార్యదర్శి ఆనంద్, సలహాదారుడు నరేంద్ర, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



## బ్రాహ్మణ కుటుంబంపై దాడి బాధాకరం

**మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



**తెనాలి:** ఆలయాన్ని పునర్ నిర్మించుకుంటున్న బ్రాహ్మణ కుటుంబంపై తెలుగుదేశం నేతల దాడి బాధాకరమని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఈ మేరకు పచ్చనేతల దాడిని ఖండిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్చకులు, బ్రాహ్మణులపై దాడులు పెచ్చుమీరాయని ఆరోపించారు. జూలై 28న చిత్తూరు చెంగ్రాయకొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అర్చకుడి కుటుంబంపై టీడీపీ నేత లోకేష్ దాడి ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. తెలుగుదేశం దాడుల సంస్కృతి దేవాలయాల వరకు పాకడం బాధాకరమన్నారు. తెనాలి నాజరుపేటలో కృష్ణ మందిరం నిర్మాణాన్ని టీడీపీ గూండాలు పదేపదే అడ్డుకోవటమే కాకుండా, ఆలయ ప్రాంగణంలోనికి అక్కడి వార్డు టీడీపీ కార్యాలయం నుంచి వచ్చే మురుగు నీటిని వదలటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ప్రశ్నించిన ఆలయ నిర్వాహకులు బులిగొండ సుబ్బారావుపై విచక్షణరహితంగా కర్రలతో దాడికి తెగబడటంపై మండిపడ్డారు. తెలుగుదేశం నాయకులు అధికారాన్ని చూసుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. చివరికి దేవుడి సేవకు అంకితమైన వారిపై దాడికి తెగబడటం అధికార పార్టీ నాయకుల అహంకారానికి నిదర్శనమన్నారు. తెనాలి ఘటనలో నిందితులను తక్షణమే అదుపులోకి తీసుకొని.. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణులు, అర్చకులపై మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలని కోరారు.

## షటిల్ బ్యాడ్మింటన్ విజేతలుగా కాకినాడ, హైదరాబాద్ జట్లు

**గుంటూరు ఎడ్యుకేషన్:** సీబీఎస్‌ఈ క్లస్టర్ గేమ్స్–7 బాలుర షటిల్ బ్యాడ్మింటన్ విజేతలుగా కాకినాడ, హైదరాబాద్ జట్లు నిలిచాయి. ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజుల పోటీల్లో భాగంగా బాలుర బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. ఆంధ్ర, తెలంగాణల్లోని సీబీఎస్‌ఈ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా అండర్–14 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. సూర్యా అకాడమీ గ్లోబల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్–17లో కాకినాడలోని శుభనికేతన్ హైస్కూల్, హైదరాబాద్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–19లో హైదరాబాద్ ఆల్వాల్‌లోని పల్లవి మోడల్ స్కూల్, వికాస్ మోడల్ స్కూల్, ఓబుల్‌రెడ్డి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో బాలకుటీర్ కరస్పాండెంట్ రఘురాం, కేఎల్పీ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, వివిధ సీబీఎస్‌ఈ పాఠశాలల ప్రిన్సిపల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి తదితరులు

## సహోదయ గ్రూప్‌గా ఏర్పాటైన సీబీఎస్‌ఈ పాఠశాలలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** అమరావతి పరిధిలోని సీబీఎస్‌ఈ పాఠశాలలు సహోదయ గ్రూప్‌గా ఏర్పడటం మంచి పరిణామమని సీబీఎస్‌ఈ పాఠశాలల విజయవాడ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్‌దాసు పేర్కొన్నారు. ఆయన శనివారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో సీబీఎస్‌ఈ పాఠశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. గుంటూరు, కృష్ణా, పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల నుంచి హాజరైన 30 మంది ప్రిన్సిపల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కాంప్లెక్స్ అధ్యక్షురాలు సుధామాధవి, కార్యదర్శి లేళ్ల కృష్ణవేణి, సభ్యులు సరళ, సీతారామయ్య పాల్గొన్నారు.

